క్లుప్తంగా

ఎంపీసీ గ్రూప్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ వంశీమోహన్

సి.బెళగల్: ఇంటర్‌లో ఎంపీసీ చదివే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వంశీ మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో ఎంపీసీ గ్రూప్‌పై గణిత లెక్చరర్ రవికిరణ్‌తో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీసీ గ్రూప్ చేస్తే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయో విద్యార్థులకు వివరించారు. పాఠశాలలో ఎంపీసీ గ్రూప్‌లో సీట్లు ఖాళీ ఉన్నాయని.. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా పాఠశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఎంపీసీతో పాటు అన్ని ఇంటర్ గ్రూప్‌లకు అధ్యాపకులు ఉన్నారని.. మెరుగైన బోధన ఉంటుందని తెలిపారు.

రేపు కేంద్ర బృందం పర్యటన



తమ్మరాజుపల్లెలో ఓహెచ్ఆర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పాణ్యం: మండలంలోని తమ్మరాజుపల్లె గ్రామంలో ఈనెల 20వ తేదీ కేంద్రబృందం సభ్యులు పర్యటించనున్నట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ తెలిపారు. నీటి సమస్యలు, కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో రైతులను అడిగి తెలుసుకోనున్నారని చెప్పారు. కాగా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డీఈఈ మధుసూదన్, ఏఈ మధుశేఖర్‌తో మంగళవారం గ్రామంలో పర్యటించారు. ఓహెచ్ఆర్, బోర్లు, మినీట్యాంక్, ఇతర నీటి వనరులను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన ప్రసాద్

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయరహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు హైవే సిబ్బంది తెలిపారు. నంద్యాల పట్టణానికి చెందిన ప్రసాద్ వ్యక్తిగత పనినిమిత్తం కర్నూలుకు వచ్చాడు. పని ముగించుకుని ద్విచక్రవాహనంపై నంద్యాలకు తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలోని తమ్మరాజుపల్లె వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు.

అటు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే



చిన్నటేకూరులో రోడ్డుపై ఉన్న చెత్త

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో ప్రధాన రహదారిపై చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ రోడ్డులో వెళ్లాలంటే ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు చెత్త రోడ్డును పూర్తిగా కప్పేయడంతో చిన్నటేకూరు మీదుగా బస్తిపాడు, పెద్దకొట్కాల, కె.నాగలాపురం, బొల్లవరం, పుసులూరు గ్రామాలకు చెందిన ఆటో, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో దోమలు, ఈగలు, లార్వాలు పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి



మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ

సి.బెళగల్: రైతులకు ఎమ్మార్పీకే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోలకల్, ముడుమాల గ్రామాల్లో పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. ప్రభుత్వ అనుమతి ఉన్న ఎరువులు, విత్తనాలనే విక్రయించాలని సూచించారు. విక్రయించిన ప్రతి వస్తువుకు రశీదును తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధరలు, నిల్వల వివరాలను బోర్డులో ప్రదర్శించాలన్నారు. రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు.

వర్షాకాలంలో జీవాల సంరక్షణ

- సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే నష్టపోయే అవకాశం
- వ్యాధుల వల్ల 20 శాతం మరణాలు
- సకాలంలో గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవడం అవసరం
- క్రమం తప్పకుండా టీకాలు వేయిస్తే జీవాలకు రక్ష
- జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకుడు రవిబాబు సూచనలు



గొర్రెల పెంపకందారులకు సలహాలు, సూచనలు ఇస్తున్న రవిబాబు



ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ సీజన్‌లో గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సకాలంలో గుర్తించి వైద్యం అందించకుంటే జీవాలు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో నీటి సంరక్షణ, ప్రధానంగా సోకే వ్యాధులు, వాటి నివారణ పద్ధతులు తదితర వాటిని ఉమ్మడి కర్నూలు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు వివరించారు.

కర్నూలు (అగ్రికల్చర్): వర్షా కాలంలో జీవాలను వ్యాధుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. వ్యాధులను సకాలంలో గుర్తించకపోవడం, సరైన వైద్యం అందించకపోవడం తదితర కారణాల వల్ల ఏటా 20 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో గొర్రెలు, మేకలు 25 లక్షలకు వరకు ఉన్నాయి.. వైరస్, బ్యాక్టీరియా పరాన్నజీవులు ద్వారా సోకే వ్యాధులపై అవగాహన పెంచుకుని జాగ్రత్తలు పాటిస్తే విలువైన జీవాలను కాపాడుకోవచ్చు. క్రమం తప్పకుండా టీకాలు వేయిస్తే చాలా వరకు వ్యాధుల నుంచి జీవాలను రక్షించుకోవచ్చు.

అనారోగ్యానికి గురైన మేకలు, గొర్రెలను గుర్తించడం

మందలో చురుగ్గా నడవలేకపోవడం, నీరసంగా ఉండడం, మేత సరిగ్గా తినకపోవడం, నెమరు వేయకపోవడం, పొట్టలో కదలికలు తగ్గడం వ్యాధి లక్షణాలు. కాళ్ల, ముక్కుల నుంచి స్రవాలు కారడం, శరీరంపై వెంట్రుకలు ఎక్కబొడుచుకోవడం, ఎక్కువసార్లు మూత్రం పోయడం, రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. శరీర ఉష్ణోగ్రతలు ఎక్కువ లేదా తక్కువగా ఉండటం, శ్వాస వేగం తగ్గడం, పెంటికలో (పేడలో) మార్పు రావడం, చర్మం గురుకుగా మారడం, చూపు కోల్పోవడం అనారోగ్య హేతువులు.

చిటుకురోగం

చిటుకు రోగాన్ని గడ్డిరోగం, ముచ్చువ్యాధి లేదా పాడురోగంగా వ్యవహరిస్తారు. తొలకరి ఎక్కువగా ఉదయం, వేళల్లో వ్యాప్తిస్తుంది. ఏడాది వయస్సు ఉన్న గొర్రెల్లో ఎక్కువగా సోకుతుంది. బలంగా, ఆరోగ్యంగా ఉన్న జీవాలు, వలస గొర్రెల్లోనూ వ్యాపిస్తుంది. అయితే మేకలకు ఈ వ్యాధి అరుదుగా సోకుతుంది. ఇది బ్యాక్టీరియా ద్వారా సోకుతుంది. తొలకరిలో పెరిగిన పచ్చికను అతిగా మేయడం వల్ల శరీరంలో ఎప్సిలాన్ అనే విషపదార్థం విడుదల కావడం వల్ల అస్వస్థతకు గురవుతాయి. శరీరంలో అంతర్ పరాన్న జీవులు ఎక్కువగా ఉండడంతో వ్యాధి ప్రబలుతుంది. వ్యాధి సోకినపుడు హఠాత్తుగా గాలిలోకి చెంగున ఎగిరి కిందపడి అకస్మాత్తుగా ఎక్కువ సంఖ్యలో జీవాలు మరణిస్తాయి. అధికంగా జ్వరం రావడం, పండ్లు కొరకడం, వణకడం, బిగుసుకుపోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం వంటి లక్షణాలు కన్పిస్తాయి.

నివారణ

ఏటా చిటుకు రోగం వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. తొలకరిలో జీవాలు కడుపు నిండా మేత మేయకుండా చూడాలి. కొత్త పచ్చికను 3–4 గంటలు మాత్రమే మేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. గొర్రె పిల్లలు అత్యధికంగా పాలు తాగకుండా చూడాలి. తొలకరిలో వర్షాలకు మొలచి వాడిపోయిన లేత గడ్డిని తినకుండా చూడాలి.

మసూచి వ్యాధి

దీనిని షీప్‌పాక్స్, అమ్మతల్లి బొబ్బ, అమ్మోరు వ్యాధులుగా వ్యవహరిస్తారు. ఏడాదిలో ఎప్పుడైనా సోకవచ్చు. మేకలు, గొర్రెల్లో వ్యాపిస్తుంది. వైరస్ ద్వారా సంక్రమిస్తుంది. గాలి, నీరు ద్వారా స్పర్శ ద్వారా సోకుతుంది. ఇది 2–3 వారాల్లో మందలో 80 శాతం విస్తరిస్తుంది. 50 శాతం గొర్రెలు మరణిస్తాయి. జ్వరం 106 నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుంది. వెంట్రుకలు లేని ప్రాంతాల్లో అంటే తొడకింద భాగాల్లో, తోకకింద, పెదవులు, ముక్కు రంధ్రాలు, జననేంద్రియాలు, పొదుగుపై ఎర్రని దద్దులు, పొక్కులు ఏర్పడుతాయి. అవి చీము పడుతుంది. లేదా నల్లబడి పోతాయి. కళ్ల నుంచి నీరు, నోటి నుంచి చొంగ, ముక్కు నుంచి చీమిడి కారుతుంది. ఈ వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి.

గొంతు వాపు వ్యాధి

ఈ వ్యాధి వర్షాకాలంలో వ్యాప్తి చెందుతుంది. మేకలు, గొర్రెల్లో సోకుతుంది. పాశ్చురెల్లా అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది. కలుషితమైన మేత తినడం, నీరు తాగడం వల్ల విస్తరిస్తుంది. వ్యాధి సోకిన జీవాల్లో జ్వరం 106 నుంచి 107 డిగ్రీలు ఉంటుంది. తల, గొంతు, చాతి కింద ప్రాంతాల్లో వాపు కనిపిస్తుంది. నోటి నుంచి చొంగ ముక్కు నుంచి చీమిడి కారుతుంది. శ్వాస కష్టమై గురకశబ్దం చేస్తూ 24 నుంచి 36 గంటల్లో మరణిస్తుంది. వ్యాధి నివారణకు తొలకరిలో టీకాలు వేయించాలి.

నీలి నాలుక

దీనిని బ్లూటంగ్, మూతివాపు, పూతరోగం పేర్లతో వ్యవహరిస్తారు. దోమలు ఉధృతంగా ఉండే జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎక్కువగా ఉంటుంది. కొన్నిసార్లు ఫిబ్రవరి, మార్చి నెలల్లో కూడా వ్యాపిస్తుంది. ఎక్కువ గొర్రెల్లో సోకుతుంది. మేకలకు అరుదుగా వస్తుంది. వ్యాధి సోకి జీవాల్లో కనీసం 10 శాతం మరణిస్తారు. జ్వరం 105 నుంచి 107 డిగ్రీల వరకు ఉంటుంది. మూతి, పెదవులు, చిగుళ్లు, నాలుక, ముఖం వాచి ఎర్రబడుతుంది. నోటి నుంచి నురగతో కూడిన చొంగ, కళ్లు, ముక్కులు వాచి స్రవాలు కారుతాయి. దుర్వాసన వస్తుంది. చీము పట్టి నడవలేక కుంటుతాయి. నివారణకు నీటి నాలుక వ్యాధి టీకాలు వేయించాలి. దోమలను నివారించుకోవాలి.

పీపీఆర్ వ్యాధి

ఆగస్టు నెల చివరి వరకు ఈ వ్యాధి ప్రభావాల్లో జీవాల్లో ఎక్కువగా ఉంటుంది. గొర్రెల కంటే మేకలకు వస్తుంది. ఇది వైరస్ ద్వారా సోకుతుంది. కొత్తగా కొనుగోలు చేసిన గొర్రెలు, మేకలు, వలస జీవుల ద్వారా వ్యాపిస్తుంది. అధిక జ్వరం అంటే 106 నుండి 108 డిగ్రీల వరకు ఉటుంది. విరేచనాలు (నలుపురంగు) మ్యూకస్‌తో పాటు 2–3 రోజుల తర్వాత కనబడుతాయి. ఈ వ్యాధి నివారణకు ఏటా టీకాలు వేయించాలి.

నేడు బాధిత రైతులతో సమావేశం

ఓర్వకల్లు: మండలంలో హైటెన్షన్ విద్యుత్ టవర్ల ఏర్పాటు వల్ల నష్టపోతున్న రైతులతో బుధవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నటరాజన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓర్వకల్లు పవర్‌గ్రిడ్ సంస్థ నుంచి పిన్నాపురం సోలార్ పరిశ్రమ వరకు హైటెన్షన్ విద్యుత్ లైన్‌లో భాగంగా టవర్ల నిర్మాణంలో భూములు కోల్పోతున్న ఓర్వకల్లు, హుసేనాపురం, శకునాల, బ్రాహ్మణపల్లె గ్రామాలకు చెందిన రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు రైతుల అభిప్రాయాలు తీసుకుంటామని చెప్పారు. ఆయా గ్రామాలకు చెందిన బాధిత రైతులు ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద హాజరుకావాలని కోరారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

కోడుమూరు రూరల్: స్థానిక మోడల్ స్కూల్‌లో 7వ తరగతిలో 5 సీట్లు, 8వ తరగతిలో 3 సీట్లు, 9వ తరగతిలో 4 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు స్థానిక మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈనెల 21వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు.

22న ఆలయ భూములకు వేలం

పాణ్యం: దేవదాయశాఖ పరిధిలోని వ్యవసాయ భూములకు ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ సువర్ణ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ. 2 వేలు దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఒలింపిక్ డే సంబరాల్లో భాగంగా అంతర్ పాఠశాలల బాస్కెట్‌బాల్ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ 23న నగరంలో ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విత్తన రాయితీ పెంచాలని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల విత్తనాలపై 90 శాతం రాయితీ కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, రైతు సంఘం మండల అధ్యక్షుడు చంద్రబాబునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ నటరాజన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న విత్తనాలపై రాయితీలను పెంచాలన్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోవడంతో గత ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి, నష్టపరిహారం అందజేసినట్లు గుర్తుచేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, ఉల్లి, పత్తి, మిరప, కందులు, వేరుశనగ, ఆముదాలు, కొర్రల వంటి పంటలను సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. అధిక రాయితీ అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు సూర్యనారాయణ, చాంద్‌బాషా, నాగరాజు, మల్లేష్, మాసూంబాషా, జగన్నాథం, ఎల్లరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

సి.బెళగల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియాను నియంత్రించవచ్చని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మలేరియా వ్యతిరేక మసోత్సవాల్లో భాగంగా వైద్య అధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. మలేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు ప్రబలకుండా అడ్డుకట్ట వేయవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి రంగస్వామి అన్నారు. టీబీ సూపర్‌వైజర్ వేణుగోపాల్ ఆచారి, హెల్త్ సూపర్‌వైజర్లు మద్దిలేటి, మంగమ్మ పాల్గొన్నారు.

గడ్డివాములకు నిప్పు


–తిమ్మందొడ్డిలో నాలుగు గడ్డివాములు దగ్ధం



సంగాలలో దగ్ధమవుతున్న గడ్డివాములు

సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో నాలుగు గడ్డివాములు దగ్ధం అయినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి గ్రామంలో పరమేష్‌కు చెందిన రెండు, రాముడికి చెందిన రెండు గడ్డివాముల నుంచి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. వీలు కాకపోవడంతో స్థానిక పోలీసులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్ఐ తిమ్మారెడ్డి, ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అప్పటికే నాలుగు గడ్డివాములు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను గుర్తించి చట్టపరంగా శిక్షించాలని, తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

రైతులకు అందుబాటులో ఉండాల్సిందే



వ్యవసాయ సహాయకులతో మాట్లాడుతున్న ఏఓ

సి.బెళగల్: ఖరీఫ్ సీజన్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ), ఎంపీఈఓలు రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్లలో రైతులకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు, సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. పంట విత్తు, సస్యరక్షణ పద్ధతులను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా ఆర్బీకేల్లో పంట సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందులపై అవగాహన కల్పించాలని తెలిపారు. కాగా రైతు భరోసా పథకంలో పీఎం కిసాన్ అర్హులు, మరణాలపై సమగ్ర సమాచారాన్ని అందజేయాలని, అర్హులకు లబ్ధి చేకూరేలా చేయాల్సిన బాధ్యత వీఏఏలదే అని పేర్కొన్నారు. సమావేశంలో ఏఈఓ సిద్దు, ఎంపీఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆదోని అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో అమరావతినగర్‌కు వెళ్లే రహదారిలో ఓ చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి (45) మంగళవారం మృతిచెందారు. దీనిపై స్థానికులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిసర ప్రాంతాల్లో విచారణ చేయగా మృతి చెందిన వ్యక్తి ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవించేవాడని తెలిసింది. అతని సొంత వివరాలు తెలియరాలేదు. పెద్దల సమక్షంలో పంచనామా చేసి మున్సిపల్ అధికారులకు మృతదేహాన్ని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

హాస్టల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌డబ్ల్యూఓ సుంకన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. హాస్టల్‌లో చేరే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో సంక్షేమాధికారి పర్యవేక్షణలో క్రమశిక్షణతో పాటు స్టడీ అవర్స్ ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు తల్లి తండ్రుల ఆధార్‌కార్డులు, బ్యాంక్ పాస్ పుస్తకం, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేసి ఈ నెలాఖరులోగా హాస్టల్ వార్డెన్‌కు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులు స్థానిక హాస్టల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

నేడు కేంద్ర బృందం సభ్యుల రాక

కోడుమూరు రూరల్: 2023–24 సంవత్సరంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలన్నీ ఎండిపోవడంతో ప్రభుత్వం కోడుమూరు మండలాన్ని కరువు మండలంగా ఎంపిక చేసిందని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర కరువు బృందం సభ్యులు బుధవారం సాయంత్రం కోడుమూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంట నష్టపోయిన రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులంతా ఈ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను బృందం సభ్యులకు తెలియజేయాలని కోరారు.

త్వరితగతిన స్టూడెంట్ కిట్లు పంపిణీ చేయాలి



కిట్లను పరిశీలిస్తున్న ఏపీసీ

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసే స్టూడెంట్ కిట్లను ఈ నెల 20వ తేదీలోగా పంపిణీ చేయాలని అసిస్టెంట్ ప్లానింగ్ కో ఆర్డినేటర్ (ఏపీసీ) మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసర్ (సీఎంఓ) అల్లాబకాష్‌తో కలిసి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, ఎంఈఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంఈఓ కార్యాలయంలో పాఠశాలలకు పంపకుండా ఉంచిన విద్యార్థి కిట్లను పరిశీలించి మండల విద్యాశాఖ అధికారులపై మండిపడ్డారు. రెండు రోజుల్లోగా పంపిణీ చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థినుల హాజరు తక్కువగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పాఠశాలకు రాని విద్యార్థినుల పేర్లను తొలగించాలని ఎస్ఓ జ్యోతిని ఆదేశించారు. వారి వెంట ఎంఈఓ ఆదామ్ బాషా ఉన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి


కర్నూలు కల్చరల్: పర్యాటక శాఖలో చేపడుతున్న ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆ శాఖ ఆర్‌డీ అండ్ ఈడీ ఎస్.వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం వీఆర్ కాలనీలోని పున్నమి రెస్టారెంట్, హరిత హోటల్‌లో చేపడుతున్న ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. కర్నూలు యూనిట్‌లో రూ.6 కోట్లతో చేపడుతున్న ఆధునీకరణ పనులు, నూతన గదుల నిర్మాణం, బార్ అండ్ రెస్టారెంట్ రెనోవేషన్, కాన్ఫరెన్స్ హాల్ ఆధునీకరణ, ల్యాండ్ స్కేపింగ్ పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. కస్టమర్లు పెరిగేలా, పర్యాటకులు ఆకర్షితులు అయ్యేలా ఆధునీకరణ పనులు చేయాలన్నారు. టూరిజం శాఖ డీవీఎమ్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఈఈ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

చదరంగం సాధనతో మేధాశక్తి పెంపు

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రమం తప్పకుండా చదరంగం సాధన చేస్తే మేధాశక్తి పెంపొందుతుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన డీఎస్‌డీఓ మాట్లాడుతూ నిత్యం ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు క్రీడల వల్ల ఎంతో ఉపశమనం పొందవచ్చన్నారు. ప్రతిఒక్కరూ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న పోటీల్లో క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు.

టీబీ డ్యాంలో తగ్గిన ఇన్‌ఫ్లో

- గరిష్ట నీటి మట్టానికి చేరువలో గాజనూరు జలాశయం
- నేడో, రేపో గేట్లు ఎత్తి టీబీ డ్యాంకు నీటిని విడుదల చేసే అవకాశం



తుంగభద్ర జలాశయం

హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతుండగా అవుట్ ఫ్లో మాత్రం పెరిగింది. ఈ నెల 10న అవుట్ ఫ్లో కేవలం 10 క్యూసెక్కులు మాత్రమే ఉండి ఇన్‌ఫ్లో 4 వేల క్యూసెక్కులకు పైగా ఉండేది. ఈ కారణంగా డ్యాంలో 6 టీఎంసీలకు పైగా నీరు నిల్వ అయ్యాయి. అయితే మంగళవారం ఇన్‌ఫ్లో 801 క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో పాటు రాయచూరుకు సంబంధించి లెఫ్ట్ బ్రాంచ్ మెయిన్ కెనాల్ (ఎల్‌బీఎంసీ)కు 1620 క్యూసెక్కులు, రాయబసవన కాలువకు 116, జిందాల్‌కు 10 క్యూసెక్కులతో కలిపి 1752 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఈ కారణంగా మంగళవారం డ్యాంలో నీటిమట్టం 5.9 టీఎంసీలకు తగ్గింది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో నాలుగున్నర టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండింది. టీబీ డ్యాం పూర్తిమట్టం 1633 అడుగులతో 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా ప్రసుతతం 1582.81 అడుగులతో 5.979 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిండుతున్న గాజనూరు (తుంగ) జలాశయం

కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో గత కొద్ది రోజులుగా ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో టీబీ డ్యాం ఎగువన 3.10 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న గాజనూరు జలాశయం (తుంగ ప్రాజెక్ట్)లో నీటి నిల్వ గరిష్ఠ మాట్టానికి చేరుతోంది. దీంతో నేడో, రేపో జలాశయం గేట్లను ఎత్తే అవకాశం ఉండడంతో దిగువన ఉన్న తుంగభద్ర డ్యాంకు నీరు పరుగున రానున్నాయి. ఎగువన ఉన్న చిక్క మంగళూరు, కొప్పి, శివమొగ్గ, శృంగేరి, వరనాడు, మలేనాడు, తీర్థనహళ్లి తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అక్కడి వాగులు, వంకలు, నదుల్లో వరద పెరుగుతోంది. గతేడాది దిగాలు చెందిన రైతులు తుంగా నుంచి నీరు విడుదలై టీబీ డ్యాం త్వరగా నిండాలని ఆశగా ఎదురు చూస్తున్నారు.

విస్తారంగా పత్తి సాగు

గడివేముల: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రత్తి పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. ముఖ్యంగా బూజునూరు, గడివేముల, బిలకలగూడూరు, గని, కొర్రపోలూరు, మంచాలకట్ట గ్రామాల్లో బోర్ల కింద పత్తి పంట వేశారు. గడివేముల మండలంలో సుమారు 26 వేల ఎకరాల్లో ఇప్పటికే 6 వేల ఎకరాల్లో పత్తి పంట వేశారు. వర్షాలు సకాలంలో కురవడంతో పంటలు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే వర్షాలు పడుతుండడంతో పంటల దిగుబడి బాగుంటుందని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



గడివేములలో సాగు చేసిన పత్తి పంట



బూజునూరులో సాలు తీస్తున్న రైతు